సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



చామనపల్లిలో హోమం

ధర్మారం: చామనపల్లిలోని శ్రీశైలమల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం సామూహిక నవగ్రహ రుద్ర హోమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



సమస్యలు పరిష్కరించండి

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నాయకులు ధర్నా చేశారు.

గరిష్టం/కనిష్టం
33.6/20.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మేడారం కోర్టులో సంబురాలు



మిఠాయిలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ధర్మారం(ధర్మపురి): నందిమేడారంలోని జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం బార్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు నార అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మిఠాయిలు పంచిపెట్టి సంబురాలు చేసుకున్నారు. కోర్టు ఏర్పాటుకు సహకరించిన హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ పోనుగోటి నవీన్‌రావుకు న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఆకారి రాజేశం, కోశాధికారి నూనె సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ బీమారపు సంపత్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఊరట

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక నిర్వాసితులకు హైకోర్టులో ఊరట లభించింది. మారేడుపాక నిర్వాసితులకు పునరావాసం కింద ఇచ్చిన ప్లాట్లకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం 25ఏళ్లుగా కాలయాపన చేస్తోంది. దీనిని సవాల్ చేస్తూ గ్రామానికి చెందిన కూరపాటి రాజేశంతోపాటు నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించారు. రెండు వర్గాల వాదనలు విన్న హైకోర్టు.. పట్టాల జారీ కోసం విచారణ జరిపి, రెండు వారాల్లోగా తమకు నివేదిక అందజేయాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారులు, రామగుండం తహసీల్దార్‌ను ఆదేశిస్తూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా సమస్య పరిష్కారం కోసం పోరాడుతున్న నిర్వాసితులకు కోర్టు ఆదేశాలు ఎంతో ఊరటనిచ్చాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కుష్ఠు నిర్మూలనకు కృషి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఎలిగేడు(పెద్దపల్లి): కుష్ఠు నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీపీఎంవో ప్రకాశ్‌రావు కోరారు. సుల్తాన్‌పూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం కుష్ఠు నిర్మూలనపై ఆయన అవగాహన కల్పించారు. 3 ఏళ్లనుంచి ఐదేళ్ల తర్వాత కుష్ఠు నిర్ధారణ అవుతుందని ఆయన తెలిపారు. దీనికి లింగభేదం, వయసుతో సంబంధం లేదని పేర్కొన్నారు. తొలిదశలో గుర్తిస్తే వ్యాధిని నయం చేసే వీలుందని తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్ఈ రాజేశ్వరిదేవి, హెచ్ఎం నరేంద్రచారి, ఎంఎల్ హెచ్ఈ విజయ్, ఏఎన్ఎం జ్యోత్స్న, ఆశ కార్యకర్త లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారుడికి అవార్డు



కృష్ణను సన్మానిస్తున్న సభ్యులు

రామగిరి(మంథని): జేఎన్టీయూ అధ్యాపకుడు, అంతర్జాతీయ త్రీడీ కళాకారుడు ఎస్ఎస్ఆర్ కృష్ణకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ప్రతిష్ఠాత్మక వొకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేసింది. తమ వృత్తిలో నిస్వార్థ సేవలు అందించడం, నైపుణ్యాలు కనబర్చిన వారికి ఏటా ఆ సంస్థ ఈ అవార్డులు అందిస్తోంది. ఈ అవార్డు అందుకున్న అత్యంత పిన్నవయస్కుడు కృష్ణ.

డ్రోన్లపై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇంజినీర్ ఏలీషా

రామగిరి(మంథని): మంథని జేఎన్టీయూ మెకానికల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి వర్క్‌షాపు సోమవారం క్యాంపస్‌లో ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆర్జీ–3 ఏరియా ఇంజినీర్ ఏలీషా, ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాపు డీజీఎం ఎర్రన్న జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏలీషా మాట్లాడుతూ కళాశాల సమీపంలోని 55 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో సోలార్ ప్లేట్లను డ్రోన్ల సాయంతో శుభ్రం చేసే విధానంపై విద్యార్థులు అధ్యయనం చేసి పరిష్కారం చూపాలని కోరారు. వ్యవసాయంతోపాటు దేశ సరిహద్దుల్లో కాపలా కోసం డ్రోన్లు ఉపయోగించడం సంతోషకరమన్నారు. ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, ప్రతినిధులు పీయూష్ ఝా, స్వప్న, ఈశ్వర్, హర్షిత పాల్గొన్నారు.

















'మొబైల్'వాణి!

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలోనివీ దృశ్యాలు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు అభాగ్యుల నుంచి అర్జీలు స్వీకరిస్తుండగా.. వారి సమస్యలను ఆలకించాల్సిన వివిధ విభాగాల అధికారులు ఇదిగో ఇలా మొబైల్ ఫోన్లు పట్టుకుని కాలక్షేపం చేయడంలో నిమగ్నమయ్యారు. 'ఇదేనా ప్రజా సమస్యలు పరిష్కరించే వేదిక?' అని అభాగ్యులు ప్రశ్నించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఒక్క చాన్స్ ప్లీజ్

- కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం పోటాపోటీ
- 29మంది ఆశావహుల దరఖాస్తు
- ముగ్గురిని ఫైనల్ చేయనున్న స్క్రీనింగ్ కమిటీ
- అభ్యర్థుల ఎంపికపై వ్యూహాత్మక ఎత్తుగడ
- టికెట్ కన్ఫర్మ్ కోసం 'గాడ్‌ఫాదర్'ల చుట్టూ ప్రదక్షిణలు

సాక్షి, పెద్దపల్లి: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. త్వరలోనే జరగనున్న లోక్‌సభ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. కేంద్రంలో కాంగ్రెస్ సర్కార్ ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వానికి అన్నివిధాలుగా సహాయ, సహకారాలు బాగుంటాయని ప్రచారం ప్రారంభించింది. మరోవైపు.. ఆశావహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి హస్తం గుర్తుపై పోటీచేసేందుకు ఆసక్తి ఉన్న నేతలు గాంధీభవన్‌లో దరఖాస్తులు సమర్పించారు. ఎస్సీ నియోజకవర్గమైన పెద్దపల్లి స్థానానికి మొత్తం 29మంది అభ్యర్థులు అందించారు. దరఖాస్తులను వడపోసి, క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వే నివేదికల ఆధారంగా టికెట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ అధినాయకత్వం చెబుతోంది.

గెలుస్తామనే ధీమాతోనేనా?

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం ఆదినుంచీ ఎక్కువసార్లు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉంటూ వస్తోంది. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో హస్తం హవా జోరుగా వీసింది. అసెంబ్లీ ఫలితాల నేపథ్యంలో పెద్దపల్లి లోక్‌సభ స్థానం హస్తగతం కావడమే తరువాయి అన్నట్లుగా పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ సాగుతోంది. గెలుపు పక్కా అనే అంచనాలతోనే నేతలంతా పార్టీ టికెట్ కోసం తమవంతు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. టికెట్ దక్కించుకుంటే చాలు.. గెలుపు 'నల్లేరుమీద నడకే' అన్న అభిప్రాయంతోనే పలువురు ఆశావహులు తమ గాడ్‌ఫాదర్‌ల మద్దతుతో గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకుంది వీరే..

టీపీసీసీ ట్రెనింగ్ మెంబర్, ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్, తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, మాజీ ఎంపీ సుగుణకుమారి, గడ్డం వంశీకృష్ణ, టీపీసీసీ కార్యదర్శి గోమాస శ్రీనివాస్, డాక్టర్ అనిల్‌కుమార్, బూడిద మల్లేశ్, కొండ శంకర్, పెర్క శ్యామ్, కట్కూరి సందీప్.. ఇలా మొత్తం 29మంది తమకు అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. వారి పనితీరు, అనుభవం ఆధారంగా కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ ముగ్గురి పేర్లను అధిష్టానానికి పంపనుంది. వారిలో ఒకరిని ఈనెల 15 తర్వాత కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) ప్రకటించనుంది. అయితే అంతిమంగా కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి.

ఫీడ్‌బ్యాక్ సేకరణ



- రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఎంపీ స్థానాలను కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.
- ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి పార్టీ జిల్లా కమిటీల అధ్యక్షులతోపాటు సీనియర్ నేతల అభిప్రాయాలూ సేకరిస్తున్నారు.
- ప్రభుత్వం పక్షాన ఇంటెలిజెన్స్ అధికారులు.. దరఖాస్తులపై ఆరా తీస్తున్నారు.
- పార్లమెంట్ నుంచి టికెట్ ఆశించే వారిసంఖ్య భారీగా ఉండటంతో ఆయా అసెంబ్లీల్లోని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, వివిధ వర్గాల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను ఫ్లాష్ సర్వేల ద్వారా తెప్పించుకుంటున్నారు.
- వరంగల్, నాగర్‌కర్నూలు, పెద్దపల్లి ఎస్సీ నియోజకవర్గాలు కావడంతో సామాజిక వర్గాల వారీగా ఎవరికి టికెట్ ఇస్తే బాగుంటుందో తెలుసుకునే ప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నారు.
- ఆశావాహులు ఎవరికి వారుగా ప్రయత్నిస్తుండగా.. అధిష్టానం ఆశీస్సులు ఎవరికి దక్కుతాయనేది చర్చనీయాంశంగా మారింది.

సమస్యలు పరిష్కరించండి

- ప్రజావాణిలో ప్రజల ఆవేదన
- అర్జీలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



అర్జీలు స్వీకరిస్తున్న స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు

- విద్యుత్ మీటరు కనెక్షన్ కోసం కరెంట్ సార్లకు దరఖాస్తు చేసుకున్న. స్తంభాలు దూరంగా ఉన్నాయని, మరోరెండు ఏర్పాటు చేస్తే మీటరు మంజూరు చేస్తామని అటున్నరు. మా ఇంటికి ఎలాగైనా కరెంట్ మీటరు మంజూరు చేయించండి.
  – చెలికాని సంధ్య, పీకే రామయ్యకాలనీ, ఎన్టీపీసీ, రామగుండం
- మా నాన్న నుంచి నాకు వారసత్వంగా వచ్చిన భూమిని అధికారులు ఆన్‌లైన్ చేయడం లేదు. ఈ విషయంలో కొందరు అధికారులు నన్ను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నరు. దయచేసి నా భూమి ఆన్‌లైన్ అయ్యేలా చూడండి.
  – చంద్రమౌళి, జూలపల్లి, కమాన్‌పూర్ మండలం

పెద్దపల్లిరూరల్: వివిధ సమస్యలతో బాధపడుతున్న అనేకమంది అభాగ్యులు.. తమకు పరిష్కార మార్గాలు చూపించాలని కోరుతూ జిల్లా అధికారులకు విన్నవించుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా వారు తమ ఆవేదనలను అర్జీల రూపంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, ఆర్డీవో మధుమోహన్‌కు అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. వారి వేదనలను ఓపికగా విన్నారు. ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కొందరు అభాగ్యులను పలుకరించగా తమ వేదనను ఇలా వెల్లడించారు..

ఆన్‌లైన్‌లో సవరించాలి



కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లిలో నేను కొనుగోలు చేసి పంటలు పండించుకుంటున్న భూమిని ఏ ఆధారాలు లేకుండా రెవెన్యూ అధికారులు మరొకరి పేరిట అక్రమంగా పట్టా చేశారు. దానిపై విచారణ జరిపించండి. పట్టాను రద్దు చేసి నాపేరు ఆన్‌లైన్‌లో నమోదు చేసి న్యాయం చేయాలి.

– గోస్కుల రమేశ్, వెన్నంపల్లి

కాజ్‌వేలు నిర్మించాలి



పెద్దబొంకూర్ నుంచి దస్తగిరిపల్లి మీదుగా కొత్తపల్లి వరకు ఉన్న లోలెవల్ కాజ్‌వేలతో వానాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు విస్తరణ చేపట్టిన అధికారులు, పాలకులు.. అదేమార్గంలో దస్తగిరిపల్లి, కొత్తపల్లి శివారులోని లో లెవల్ కాజ్‌వేలను కూడా నిర్మించి ఇబ్బందులు దూరం చేయాలి.

– బాలసాని లెనిన్, కొత్తపల్లి

ఉపాధి చూపండి



పుట్టుకతోనే దివ్యాంగుడిని. అయినా, డిగ్రీ చదివిన. కూలీ పనులు చేసి నన్ను చదివించిన మా అమ్మానాన్నలు ఆర్థికంగా చితికి పోయారు. ఏదైనా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తే నా కుటుంబాన్ని పోషించుకుంటా.

– గాజుల రవికాంత్, బేగంపేట, రామగిరి

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



జ్యోతినగర్(రామగుండం): రామగుండం నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఎన్టీపీసీ ఉద్యోగ వికాస కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యాలు ప్రభావిత, పునరావాస గ్రామాల అభివృద్ధికి సీఎస్సార్ నిధులు కేటాయించాలన్నారు. సీఎస్సార్ ద్వారా ఇప్పటివరకు కేటాయించిన, పనులకు కేటాయించిన నిధుల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. 2, 3, 4, 5, 23 డివిజన్లతోపాటు కుందనపల్లి, ఎల్కలపల్లి తదితర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎన్టీపీసీలో ఉద్యోగాలు పెట్టిస్తామని ఓ వ్యక్తి.. ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారని, ఆ డబ్బులు వెనక్కి ఇవ్వాలన్నారు. ఎన్టీపీసీ బూడిద తరలింపు ప్రక్రియను ప్రభావిత గ్రామాలకు ఇప్పించి, ఇటుక బట్టీల నిర్వాహకులకు ఉచితంగా అందించాలని కోరారు. సీఎస్సార్ ద్వారా యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు.

'రుడా' ఏర్పాటుతో బీ–కేటగిరీ మార్పు..

మున్సిపల్ కార్పొరేషన్‌ను రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి 'రుడా' ఏర్పాటు చేయిస్తానని ఠాకూర్ హామీ ఇచ్చారు. తద్వారా ఈ ప్రాంతం బీ–కేటగిరీలోకి మారనుందని తెలిపారు. రాజీవ్ రహదారి వెంట ప్రమాదాల నివారణకు సర్వీసు రోడ్డు నిర్మిస్తామన్నారు. సింగరేణి, ఎన్టీపీసీలు ఇక్కడ ఇంజినీరింగ్, మైనింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ ఇచ్చిన హామీ మేరకు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సూచించారు.

కొత్త విద్యుత్ ప్రాజెక్టులు స్థాపించాలి

ఎన్టీపీసీ ఆవరణలో తెలంగాణ ప్రాజెక్టు స్టేజీ–2లో 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లు నెలకొల్పి 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. రామగుండం బీ–పవర్‌హౌస్ స్థానంలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్రాజెక్టు నిర్మించేందుకు కృషి చేస్తామని అన్నారు. నియోజకవర్గంలో రూ.50కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. నిర్వాసితులకు ఎన్టీపీసీ హెల్త్‌కార్డులపై పూర్తిస్థాయి వైద్యం అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

పల్లెప్రజలకు మెరుగైన సేవలు అందాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పల్లెల్లో పంచాయతీ విధులు నిర్వర్తించే ప్రత్యేకాధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీ స్పెషలాఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. విధులు, కొత్త చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేదాకా ప్రత్యేకాధికారుల పాలనే కొనసాగుతుందన్నారు. నిధుల వినియోగం, బిల్లుల చెల్లింపు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రధానంగా పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా వసూలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో సమస్యలు గుర్తించి పరిష్కరించాలని చెప్పారు. ఈ సమావేశంలో డీపీవో చంద్రమౌళి, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీధర్‌తోపాటు సురేందర్, ఎస్‌బీఎం రాఘవులు, డీపీఎం రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బారినుంచి కాపాడండి



పెద్దపల్లిరూరల్: కోతుల బెడద ఎక్కువైందని, వాటిని నియంత్రించాలని పెద్దబొంకూర్ గ్రామస్తుడు మిట్టపల్లి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీని కలిసి సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వెంటాడుతున్న వానరాలు' కథనం క్లిప్పింగ్‌ను అందజేశారు. గ్రామానికి చెందిన లక్ష్మి కోతుల భయంతో కిందపడి ప్రాణాలనే కోల్పోయిందని వివరించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కోతుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల నాయకుడు 'బిరుదు'

- ఊరూరా వాటర్ ట్యాంకులు నిర్మించిన నేత
- ఎన్టీఆర్ మెచ్చిన అభిమాని
- మాజీ ఎమ్మెల్యే రాజమల్లు అస్తమయంతో విషాదం

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: ఆయన ప్రజానాయకుడు.. ఊరూరా అభిమానులు కలిగిన నేత.. అన్ని పల్లెల్లోనూ బంధువులు ఉన్న నిరాడంబర జీవి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్న పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు.. సోమవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో హఠాత్తుగా గుండెపోటుకు గురై తుదిశ్వాస విడవడంపై నియోజకవర్గం విషాదంలో మునిగింది. ఈ సమాచారం తెలుసుకున్న అభిమానులు, బంధు, మిత్రులు, రాజకీయ పార్టీల నేతలు సుల్తానాబాద్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. మధ్యాహ్నం తర్వాత భౌతికకాయం హైదరాబాద్ నుంచి రాగానే.. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎంపీ సుగుణకుమారి తదితర నాయకులు.. పార్థీవదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

ఆయన సేవలు చిరస్మరణీయం..

- పెద్దపల్లి ఎమ్మెల్యేగా 1994లో ఎన్నికైన బిరుదు రాజమల్లు.. సంక్షేమ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చారు. తాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి, వాటర్ ట్యాంకులు నిర్మించిన తొలి ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కావడం గమనార్హం. హుస్సేనిమియావాగుపై కూనారం వద్ద వంతెన పనులు ఆయన హయాంలోనే ప్రారంభించారు.

కోర్టు ఏర్పాటుకు కృషి..

- పెద్దపల్లికి 1996లో ప్రభుత్వం కోర్టు మంజూరు చేసింది. అయితే, స్థలం అందుబాటులో లేక అద్దె భవనంలో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అందులోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని మరో భవనంలోకి తరలించారు. అందులో కోర్టు ప్రారంభించారు. ఇది అప్పటి ఎమ్మెల్యే రాజమల్లు చొరవతోనే సాధ్యమైందని న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు.

బీసీల ఐక్యత కోసం..

- నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనంత భారీ మెజార్టీతో తనను ఎమ్మెల్యేగా గెలిపించారని భావించిన బిరుదు.. బీసీలు ఐక్యంగా ఉండేలా పలు కార్యక్రమాలను చేపట్టారు. ప్రధానంగా తన సామాజిక వర్గం మున్నూరుకాపుల తోపాటు ఇతర కులాలను కలుపుకుని ముందుకు సాగారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ మున్నూరుకాపులను ఏకం చేయడంలో సఫలీకృతులయ్యారు.



నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ సుగుణకుమారి, ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు

ఎన్టీఆర్ అభిమాన సంఘం నేతగా..

- 1 అక్టోబర్ 1950న పుట్టిన బిరుదు ..1976లో సుల్తానాబాద్ పంచాయతీ కారోబార్‌గా తన ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. అప్పుడే ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆరంభించారు. 1981లో సుల్తానాబాద్ సర్పంచ్‌గా, కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

తొలిసారి స్వతంత్రుడిగా పోటీ..

పెద్దపల్లి అసెంబ్లీ స్థానానికి 1983లో టీడీపీ టికెట్ ఆశించారు. ఆ సమయంలో ఐదు స్థానాలను టీడీపీ అధినేత ఎన్టీఆర్.. సంజయ్ విచార్‌మంచ్‌కు కేటాయిస్తూ పొత్తు కుదుర్చుకున్నారు. ఆ పొత్తులో పెద్దపల్లి టికెట్‌ను గోనె ప్రకాశ్‌రావుకు కేటాయించారు. అయినా బిరుదు స్వతంత్రుడిగా పోటీచేసి 6వేలకు పైగా ఓట్లు సాధించారు. 1984లో సుల్తానాబాద్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. 1989లో టీడీపీ నుంచి అసెంబ్లీకి పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1994లో టీడీపీ నుంచి పోటీచేసి నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనంతగా 40వేలకుపైగా మెజార్టీతో గెలుపొందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన కోడలు బిరుదు సమత సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.



ఎన్టీరామారావుతో బిరుదు రాజమల్లు(ఫైల్)

కుటుంబనేపథ్యం..

- బిరుదు రాజమల్లుకు భార్య సుశీల ఉన్నారు. వీరికి రాధాకృష్ణ, శ్రీనివాస్, అనిల్, సంతోష్ కుమారులతోపాటు స్వరూప, రత్నకుమారి కుమార్తెలు ఉన్నారు. అల్లుళ్లు గిరిప్రసాద్, సాయిబాబు ఏసీపీలుగా పనిచేస్తున్నారు.

క్లుప్తంగా

సర్పంచుల సేవలు మరువలేనివి


సర్పంచులతో ఎంపీపీ స్రవంతి తదితరులు

ఎలిగేడు(పెద్దపల్లి): సర్పంచులు తమ పదవీకాలంలో ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాజీ సర్పంచులను ఎంపీపీ ఆధ్వర్యంలో సన్మానించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక హాజరయ్యారు. తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్, మాజీ సర్పంచులు భూర్ల సింధూజ, గొల్లే కావేరి, సౌమ్య, తంగెళ్ల స్వప్న, సింగిరెడ్డి ఎల్లవ్వ, దేవరనేని ప్రభావతి, మాడ కొండాల్‌రెడ్డి, గోపు విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేజిక్ రాజాకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న మేజిక్ రాజా

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి మేజిక్ రాజా వరుసగా రెండు అవార్డులు అందుకున్నారు. చాంబర్ ఇంటర్నేషనల్ సంస్థ తృతీయ ఆవిర్భావ వేడుకల సందర్భంగా మంచిర్యాలలోని నస్పూర్‌లో జూనియర్ నిర్వహించిన కార్యక్రమంలో మేజిక్ రాజాను 'అవుట్ స్టాండింగ్ న్యూస్ రీడర్ అవార్డ్' అవార్డుతో సత్కరించారు. అలాగే గోదావరిఖని ఆర్‌సీవోఏ క్లబ్‌లో బిట్ బిట్ డాన్స్ అకాడమీ, దేవా కళా బృందం నిర్వహించిన వేడుకల్లో ×సకల కళా వల్లభ అవార్డ్×తో సత్కరించారు. ఒకేరోజు రెండు జిల్లాల్లో పురస్కారాలు అందుకోవడంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్, స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్, రామగుండం కళాకారుల సంక్షేమ సంఘం, నియర్ అండ్ డియర్ ఫ్రెండ్లీ ఆర్గనైజేషన్, రామగుండం ఏరియా యూట్యూబర్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

జ్వరంతో రైతు మృతి

కమాన్‌పూర్(మంథని): సిద్దిపల్లె గ్రామ పరిధిలోని శాలపల్లెకు చెందిన రైతు మాటేటి రమేశ్(52) జ్వరంతో సోమవారం మృతి చెందాడు. రమేశ్ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. రక్తకణాలు తగ్గిపోవడంతో రమేశ మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని రైతు బీమాతో ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

జూలపల్లి(పెద్దపల్లి): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం.. వెంకట్రావుపల్లెకు చెందిన జుట్టు అనూష(28), కోనరావుపేటకు చెందిన మాల్లారపు రాము(30) పన్నేండేళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. ఇద్దరు ఆడ, మరో ఇద్దరు మగ పిల్లలు. అందరూ తొమ్మిదేళ్ల వయసులోపు వారే. బతుకుదెరువు కోసం మహారాష్ట్రలో ఉంటున్నారు. మహిళా సంఘాల్లో పని ఉందనే కారణంతో 15రోజుల క్రితం కోనరావుపేటకు వచ్చారు. ఈక్రమంలో అనూషకు కుటుంబ సభ్యులతో గొడవ జరిగింది. మనస్తాపం చెందిన ఆమె గడ్డి మందు తాగింది. పెద్దపల్లిలో ప్రాథమిక చికిత్స అనంతరం కరీంనగర్ తరలించగా ఆదివారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి తండ్రి జుట్టు ఓదెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బొగ్గు ఉత్పత్తిలో ఓసీపీ-1 రికార్డు

- 56 రోజుల ముందుగానే లక్ష్యం ఛేదన
- 30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి పూర్తి
- సమష్టి కృషితోనే సాధ్యం : ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ


విద్యుత్ దీపాల వెలుగులో ఓసీపీ-1 క్వారీ

గోదావరిఖని: క్లిష్టమైన పరిస్థితులు.. ఇరుకైన పనిస్థలాలు.. అయినా పట్టుదలతో సమష్టిగా శ్రమించిన కార్మికులు నిర్దేశిత గడువుకు ముందే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించారు. ప్రాజెక్టు వార్షిక లక్ష్యం 56రోజుల ముందుగానే చేరుకున్నారు ఓసీపీ-1 ప్రాజెక్టు ఉద్యోగులు. సింగరేణి సంస్థ రామగుండం రీజియన్‌లోని ఓసీపీ-1.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 30లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించింది. ప్రణాళిక బద్ధగా ముందుకు సాగుతూ రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటూ లక్ష్యాల సాధనపై దృష్టి సారించారు కార్మికులు. ఈక్రమంలో మంచి ఫలితాలను సాధించారు. ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ నేతృత్వంలో అన్నివిభాగాల అధికారులు, కార్మికులు ఉత్పత్తి లక్ష్యంపై దృష్టి పెట్టారు. కొన్నేళ్లుగా వార్షిక లక్ష్య సాధనను ముందుగానే సాధిస్తున్న ఓసీపీ - వన్.. సకాలంలో పనిస్థలాలు అందుబాటులో లేకపోవడంతో కొంతకాలంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. కొత్త ప్రాజెక్టుకు అనుమతులు ఆలస్యం కావడం, పనిస్థలాలు తగ్గిపోవడం, ఇరుకైన పనిస్థలాల మధ్య అధికారులు, కార్మికులను సమన్వయం చేసుకుంటూ లక్ష్య సాధన వైపు నడిపించారు. ప్రయత్నాలన్నీ సఫలం కావడంతో రెండు నెలల ముందుగానే అనుకూల ఫలితాలు వచ్చాయి. ఈక్రమంలో 2023-24లో నిర్దేశిత 30 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 220లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత సాధించారు. సింగరేణి సంస్థలోనే నంబర్ - వన్‌గా నిలిచారు.

ప్రాజెక్టు పేరు	ఓసీపీ-1
ఆర్థిక సంవత్సరం	2023-24
లక్ష్యం(లక్షల టన్నుల్లో)	30
నిర్దేశిత గడువు	ఫిబ్రవరి 04

సంతోషంగా ఉంది



నిర్దేశించిన గడువుకు ముందే వార్షిక లక్ష్యాలు సాధించడం సంతోషంగా ఉంది. పనిస్థలాల్లో సౌకర్యాలు కల్పించడంతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేశాం. ఇదే స్ఫూర్తితో పనిచేసి అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధిస్తాం. ఇరుకు పనిస్థలాలు ఉన్నా అందరం సమష్టగా లక్ష్యాల సాధన కోసం శ్రమించాం.

– ఆర్.మోహన్‌వర్మ, షావల్ ఆపరేటర్

ప్రోత్సాహించారు



బొగ్గు ఉత్పత్తి సాధించడంలో అధికారుల ప్రోత్సాహం ఎంతగానో ఉంది. పనిస్థలాల్లో రక్షణ చర్యలు పాటించడం, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయడంతో ప్రమాదాలు లేకుండా ముందుకు సాగుతున్నాం. పనిస్థలాలు తగ్గి ఇరుకుగా మారినా పట్టుదలతో ముందుకు సాగాం.

– వి.సుబ్బారావు, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్

ముందుకు సాగాం



నిర్దేశిత సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. రోజులో 18గంటల పాటు యంత్రాలు నడిచేలా అధికారులు ప్రణాళికలు సిద్ధ చేశారు. అందుకు అనుగుణంగా మేము కూడా ఉత్సాహంతో ముందుకు సాగాం. షావల్ ఉత్పత్తికి అనుగుణంగా డంపర్లను నడిపాం. ముందుగానే ఉత్పత్తి సాధించడం సంతోషంగా ఉంది.

– ఠాకూర్ రూపేశ్‌సింగ్, ఈపీ ఆపరేటర్

సమష్టి కృషితోనే సాధ్యం



ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, అధికారుల సమష్టి కృషితోనే 56రోజుల ముందుగానే వార్షిక లక్ష్యాలు సాధించాం. ఇందులో అలుపెరగకుండా శ్రమించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఓసీపీ-1ను సంస్థలోనే నంబర్‌వన్‌గా నిలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగిరికార్డు స్థాయి ఉత్పత్తి సాధించాలి.

– రాధాకృష్ణ, ప్రాజెక్టు అధికారి

బొగ్గుబాయి వార్తలు

పనిగంటలు పెంచితేనే భవిష్యత్

- ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ


షావల్ నడుపుతున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: పని గంటలు పెంచి భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. రూ.9.26 కోట్లతో కొనుగోలు చేసిన నర్మద, సింధూ షావల్ యంత్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఓసీపీ-3 కృషి భవన్ సమీపంలోని ఇంటర్నల్ పార్కింగ్ యార్డు వద్ద తొలుత ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రాజుక్టు అధికారి మధుసూదన్, ఎస్‌వోటూ జీఎం రవీందర్, యూనియన్ నాయకుడు జిగురు రవీందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, గని మేనేజర్ భారత్‌కుమార్, బేస్‌వర్క్ షాప్ ఎస్ఈ రామకృష్ణ, షావల్స్ సెక్షన్ ఇన్‌చార్జి జనార్దన్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహమ్మద్, సంక్షేమాధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం వైపు వకీల్‌పల్లి గని

లక్ష్యాల సాధనలో వకీల్‌పల్లి భూగర్భగని దూసుకెళ్తోందని ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ వెల్లడించారు. సోమవారం గనిలో జరిగిన మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగతా భూగర్భ గనులకు భిన్నంగా ఉత్పత్తి లక్ష్యాల సాధనలో వకీల్‌పల్లి అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు అన్ని గనులపై మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ పర్యటిస్తుందని తెలిపారు. కమిటీ సభ్యుల సూచనలు, సలహాలను పాటించి సంస్థ అభివృద్ధి, నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని సూచించారు. ఇదే సమయంలో రక్షణతో కూడిన ఉత్పత్తికి అంకితభావంతో పనిచేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం బచ్చ రవీందర్, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, యూనియన్ నాయకుడు జిగురు రవీందర్, మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి


మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి(మంథని): పనిస్థలాల్లో రక్షణ చర్యలు పాటిస్తూ, సమష్టిగా నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్‌రావు సూచించారు. సోమవారం ఆర్జీ-3 ఓసీపీ-2లో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రగతి కోసం, నిర్దేశిత లక్ష్యాలు అధిగమించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. వచ్చేఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 77 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించడానికి యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ-3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి జి.శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ పి.ఏలీషా, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఐఈడీ డీజీఎం చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజినీర్ నాగరాజు, మేనేజర్ రామరావు, ఫిట్ సెక్రటరీ ఊయ్యాల కుమార్‌స్వామి పాల్గొన్నారు.

మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాల వివరాల వెల్లడి

ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలలో నిర్వహించే మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశాల వివరాలను ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంగళవారం, బుధవారం ఓసీపీ-1, గురువారం సీహెచ్‌పీ, జీఎం కార్యాలయాలు, శుక్ర, శనివారం ఏపీఏ గనుల్లో సమావేశాలు ఉంటాయని వారు తెలిపారు. అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌వోటూ జీఎంకు సన్మానం


సన్మానిస్తున్న కాలనీవాసులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ-2 ఏరియా ఎస్‌వోటూ జీఎం అబ్దుల్ సలీం ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక ముస్లింలు సోమవారం సన్మానించారు. ఎన్‌సీవోఏ క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్యాజీ ముహమ్మద్ ఇస్మాయిల్, టీఎస్ఆర్‌ఈఎస్ఐ కౌన్సిలర్ జేఐహెచ్, వైస్ ప్రెసిడెంట్ జమాత్ ఇస్లామీ హింద్ సభ్యులు, కాలనీవాసులు శాలువతో సన్మానించారు. ఈకార్యక్రమంలో డీజీఎం జావిద్ అక్మల్ హుస్సేన్, మౌలానా రఫిక్, ఆయాజ్, ఉద్దీన్, అబ్దుల్ వహాబ్, హఫీజ్, అహ్మద్, మొహియుద్దీన్, ఇబ్రహీం, ఫరీద్, ఖలీల్, వహీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలతో కూడిన బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

- ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్


మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా ప్రతీఒక్కరు ముందుకు సాగాలని ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్ కోరారు. సోమవారం జీడీకే-11గనిలో జరిగిన మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెంచుకోవాలని సూచించారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గనులు, వాటిపని తీరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, ఏరియా ఇంజినీర్ రాంమూర్తి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చర్చనీయాంశమైతే గెలిసెటోళ్లం


హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు


మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- ఆ మూడువర్గాల మద్దతు కరువై ఓటమి పాలయ్యాం
- హామీలు నెరవేర్చకపోతే గ్రామాల్లో ఉరికించి కొడుతరు
- మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్
- పెద్దపల్లి నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

సాక్షి, పెద్దపల్లి: తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిపై చర్చ జరిగితే గెలిచేవారమని, తప్పుడు హామీలు, అబద్ధాలు, విషప్రచారంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పెద్దపల్లి నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ నియోజకవర్గంలో కొత్తగా పేరు నమోదు చే సుకున్న 10వేల మంది యువ ఓటర్లు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు మద్దతు పొందలేక బీఆర్‌ఎస్ స్వల్ప ఓట్ల తేడాతో అధికారం కోల్పోయిందన్నారు. వారిని మభ్యపెట్టేలా కాంగ్రెస్, బీజేపీలు సోషల్ మీడియా వేదికగా విషప్రచారం చేశాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 50రోజుల్లోనే ప్ర జల్లో అసంతృప్తి నెలకొందని తెలిపారు. వారి మద్దతు కూడగట్టుకుని పార్లమెంట్ ఎన్నికల్లో గూలాబీ జెండా ఎగరవేద్దామని అ న్నారు. అధికారంలోకి వచ్చిన నెలకే నీటిప్రాజెక్టులను అప్పగిస్తున్నారని, ఐదేళ్లు పాలిస్తే రాష్ట్రాన్ని ఆంధ్రాకు అప్పగిస్తారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీలు నెరవేర్చేలా ప్రజల మద్దతుతో పోరు చేద్దామని మరో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. హామీలు అ మలు చేయకపోతే కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో ఉరికించి కొట్టేరోజులు వస్తాయన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఐటీ కంపెనీలకు అడ్డాగా ఉన్న హైదరాబాద్.. నేడు ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేల క్యాంపు రాజకీయాలకు అడ్డాగా మారిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తనపై 125 కేసులు నమోదయ్యాయని, 45రోజుల పాటు జైలు శిక్ష అనుభవించానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడు తూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన అనుమతులు, చేసిన అభివృద్ధి పనులకు ప్రస్తుత ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పుట్టమధు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, జెడ్పీటీసీ గంట రాములు, టౌన్ ప్రెసిడెంట్ ఉప్పు రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల కోసమే అమృత్ భారత్ రైల్వేస్టేషన్లు


హాజరైన యూనియన్ ప్రతినిధులు


శంకర్‌రావును సన్మానిస్తున్న రైల్వే ఉద్యోగులు

- ఆలిండియా రైల్వే మెన్ ఫెడరేషన్ కోశాధికారి శంకర్‌రావు ధ్వజం
- హాజరైన ఐదు జిల్లాల మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు

రామగుండం: రైల్వే ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఆర్‌ఎల్‌డీఏ) పేరిట వేలాది ఎకరాలు, రూ.కోట్లతో రైల్వేస్టేషన్లను అమృత్‌భారత్ రైల్వేస్టేషన్లుగా తీర్చిదిద్దుతున్న కేంద్రప్రభుత్వం.. వాటిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతోందని ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్‌ఎఫ్) కోశాధికారి, అనుబంధ దక్షిణ మధ్య రైల్వేమజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సీహెచ్ శంకర్‌రావు ఆరోపించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం ఆయన మజ్దూర్ యూనియన్ కార్యాలయం ప్రారంభించారు. ఏఐఆర్‌ఎఫ్ శతజయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కాజీపేట-కాగజ్‌నగర్-నిజామాబాద్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్ల నుంచి వందలాది మంది యూనియన్ నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పోరాటాల గడ్డగా పేరున్న రామగుండం నుంచి శతాబ్ది వేడుకలు ప్రారంభిస్తున్నామన్నారు. మీటరు గేజ్‌స్థాయి నుంచి ట్రిపుల్ లైన్ బ్రాడ్‌గేజ్ స్థాయి, ఎస్కలేటర్, వైఫై, షాపింగ్ మాల్స్ నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతీరోజు 21 వేల రైళ్లు, ప్రతీ ఐదు నిమిషాలకో రైలు రాకపోకలు సాగిస్తున్న స్థాయికి రైల్వే రంగం చేరినా.. ఉద్యోగుల సంఖ్య 15 లక్షల నుంచి పది లక్షలకు పడిపోవడం దురదృష్టకరమన్నారు. వీరిస్థానంలో కాంట్రాక్టు కార్మికులను భర్తీచేయడం శోచనీయమన్నారు. కోవిడ్ సమయంలో 3,800 మంది ఉద్యోగులు మృతి చెందినా.. కరోనా వారియర్స్‌గా గుర్తించకపోగా, పరిహారం కూడా చెల్లించలేదని ఆవేదన చెందారు. రామగుండం బ్రాంచి ప్రతినిధులు మెట్ట రామారా వు, ఓవై స్వామి, వీరన్న, మోజెస్, ఆనంద్ రాథోడ్, అరవింద్, రజినీకాంత్, రవి, కేంద్ర ప్రతినిధులు ఖాజాబాబా, పిల్లలమర్రి రవీందర్, ఉదయ్‌భాస్కర్, కాల్వ శ్రీనివాస్, కర్ర యాదవరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలవాలి

కరీంనగర్: ఏడేళ్లుగా వేతన సవరణలో జాప్యం వల్ల టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు ఆర్థిక ప్రయోజ నాలకు దూరమయ్యారని ఎస్ఎంయూ రీజినల్ కార్యదర్శి జక్కం పుల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి, ఉద్యోగులకు అండగా నిలవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వారి డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత

- జాగ్రత్తలు పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో అవగాహన



భద్రతా నియమాలు ముద్రించిన సేఫ్టీ బాండ్‌లు

జ్యోతినగర్(రామగుండం): మన దేశం డిజిటల్ రంగంలో దూసుకుపోతున్న క్రమంలో రోడ్డుపై మోటారు వాహనాలు సైతం విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో పాటు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రతీ వ్యక్తికి వాహనాల అవసరం తప్పనిసరిగా మారింది. నేడు ఏర్పడిన పోటీతత్వం, మానవ తప్పిదాల వల్ల, సరిపడా రహదారులు లేక, వాహనాలు సరైన కండీషన్‌లో ఉంచుకోకపోవడం, అతి వేగంతో ప్రయాణించడం, వాహన డ్రైవర్ల నిర్లక్ష్య వైఖరి, నియమాలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు క్షతగాత్రులవుతున్నారు. దీంతో పాటు ఆస్తి నష్టం కూడా జరుగుతోంది.

గత సంవత్సరం ప్రమాదాల వివరాలు

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాలో 2023లో 335 రోడ్డు ప్రమాదాలు జరగగా.. 101 మంది మృతిచెందారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 5,661 కేసులు నమోదు కాగా.. 3,217 మందికి రూ.39,76,690 జరిమానా విధించారు. 2,04,182 ట్రాఫిక్ ఈ-చలాన్లను విధించగా.. రూ.6,06,70,795 జరిమానా విధించారు.

నినాదం..

35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా 'రోడ్డు భద్రతా హీరో అవ్వండి' అనే నినాదంతో కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా వాహనాలను నడపాలి. రహదారి భద్రతా నియమాలను సక్రమంగా పాటించాలి. వాహన యజమానులు, డ్రైవర్లు, విద్యార్థులు తదితరులు నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చు.

ప్రమాదాలు జరిగే ప్రాంతాలు..

జిల్లాలోని రాజీవ్ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే కొన్ని ప్రాంతాలను గుర్తించారు. గోదావరిఖని జీఎంకాలనీ మలుపు, ఆర్టీసీ బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం క్రాస్ రోడ్, మల్కాపూర్ క్రాస్ రోడ్, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్, టీటీఎస్ గేట్, మేడిపల్లి సెంటర్, ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్, తహసీల్ కార్యాలయం, మల్యాలపల్లి అండర్ బ్రిడ్జి, ధర్మారం క్రాస్ రోడ్, మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి, పెద్దపల్లి బస్‌స్టేషన్ రాజీవ్ రహదారి, సుల్తానాబాద్ బస్‌స్టేషన్ ముందు రోడ్డు, కాట్నపల్లి స్టేజీతో పాటు పలు ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు.

ప్రమాదాల నివారణకు మార్గాలు..

అతి వేగం ప్రమాదకరం.. మద్యం తాగి వాహనాలను నడపొద్దు.. హెల్మెట్‌ధారణ ప్రాణానికి రక్షణ.. ట్రాఫిక్ నియమాలు పాటించడం.. రోడ్లపై సంభాషిస్తూ ట్రాఫిక్‌కు అవరోధం కల్పించొద్దు.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపొద్దు.. సీటు బెల్టు ధరించి వాహనాలు నడపాలి.. రాత్రి వాహనం నిలిపి పార్కింగ్ లైట్లు వేయాలి.

అవగాహన కల్పిస్తున్నారు



రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు సైతం ఆటోలకు క్యూఆర్ కోడ్‌లను కూడా కేటాయించారు. ప్రయాణికులను భద్రతతో వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నాం.

– రమేశ్, ఆటో డ్రైవర్, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్

నియమాలు పాటించాలి



ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నియమాలు వివరిస్తూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలతో ముద్రించిన, ట్రాఫిక్ సిగ్నళ్లలోని ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగులతో తయారు చేసిన సేఫ్టీ బ్యాండ్‌ల పంపిణీ చేపట్టాం. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్‌లో శిక్షణ ఇస్తున్నాం. ఫిబ్రవరి 14 వరకు నిరంతరం అవగాహన సదస్సులను నిర్వహించి ప్రమాదాల నివారణకు పాటించాల్సిన విషయాలను వివరిస్తాం.

– భీమ్‌సింగ్, ఎంవీఐ, రామగుండం